సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 8 । డిసెంబర్ । 2022

ఆర్‌ఏఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పూల విక్రయాలు



చింతపల్లి: స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో సాగు చేస్తున్న వివిధ రకాల పూలను బుధవారం చింతపల్లిలో వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు విక్రయించారు. అగ్రి టూరిజంలో భాగంగా పరిశోధన స్థానంలో గ్లాడియోలస్, బంతి, చామంతి తదితర పూల సాగును ప్రయోగాత్మకంగా సాగు చేపట్టారు. వీటితో పాటు వ్యవసాయ విద్యార్థులు శాస్త్రవేత్తల పర్యవేక్షణలో ఆకుకూరలను సాగు చేస్తున్నారు. వీటిని సేకరించి తొలిసారిగా ఇక్కడ వారపుసంతలో విక్రయించారు.

విజృంభిస్తున్న చలి గాలులు

- మన్యంలో నమోదవుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- చలికి తాళలేకపోతున్న గిరిజనులు

8లో



న్యూస్‌రీల్

అంబేడ్కర్‌కు ఎంపీ మాధవి నివాళి



నివాళి అర్పిస్తున్న మాధవి

కొయ్యూరు: శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లిన అరకు ఎంపీ మాధవి బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం ఆమె పార్లమెంట్‌కు వెళ్లారు.

ఆగ్రో రైతు సేవా కేంద్రాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, పాడేరు: ఆగ్రో రైతు సేవా కేంద్రాలకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఏపీ ఆగ్రో జిల్లా మేనేజర్ డీడీవీ ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వం మండలానికి ఒక ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని మంజూరుచేసిందని, ఈ కేంద్రం ద్వారానే వ్యవసాయ పరికరాలు, ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులను విక్రయిస్తారని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సైన్స్ పట్టభద్రులై ఉండి స్థానికంగా ఉన్నా వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఈనెల 9వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9948111798, 9948098534 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు



ఘాట్ రోడ్డులో బోల్తా పడిన ఆటో

చింతపల్లి రూరల్: మండలంలోని లంబసింగి ఘాట్ రోడ్డులో బుధవారం ఆటో బోల్తాపడి ముగ్గురు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. లంబసింగి నుంచి నర్సీపట్నం వెళుతున్న ఆటో బోడకొండమ్మ గుడికి సమీపంలో లోయలోకి దూసుకుపోయి బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. వీరిని నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రమేష్ తెలిపారు.

12 కిలోల గంజాయి స్వాధీనం

ఒకరు అరెస్టు.. మరొకరు పరారీ



నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయి, బైక్‌లతో పోలీసులు

జి.మాడుగుల: పెదబయలు మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు రెండు బైక్‌లపై బుధవారం 15 కిలోల గంజాయిని మూటలతో తరలిస్తుండగా మండలంలోని నుర్మతి వద్ద పట్టుబడ్డారని సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. వీరిలో ఒకరు తప్పించుకుని పరారైనట్టు వారు వివరించారు. పట్టుబడిన పెదబయలు మండలం బొంగరం గ్రామానికి చెందిన సారే చిట్టిబాబును అరెస్టు చేసినట్టు వారు తెలిపారు. గంజాయి, బైక్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వారు పేర్కొన్నారు.

ఆశ్రమ విద్యార్థినులను వేధించడంపై నివేదిక

రంపచోడవరం: రంపచోడవరం మండలం కాకవాడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో జరిగిన సంఘటనలపై ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు బుధవారం గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ కిషోర్ విచారణ నిర్వహించారు. విద్యార్థినులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ మేరకు నివేదికను ఐటీడీఏ పీవోకు అందజేస్తామని వారు తెలిపారు.

దళారులకు చెక్

జీసీసీ ఒకవక్క ఆదాయ వనరులు మెరుగు వరచుకోవడమే కాకుండా మరోవక్క గిరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. వారి నుంచి అటవీ ఉత్పత్తులతోపాటు వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలుకు లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల గిరిజనులకు మేలు చేకూరనుంది.

- **గిరి రైతులకు మేలే చేసేలా** గిరిజన సహకార సంస్థ కసరత్తు
- భారీగా వ్యవసాయ, అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లు
- గిట్టుబాటు ధర కల్పన
- భారీగా లక్ష్యంతో అడుగులు



గిరిజన రైతుల నుంచి కాఫీ గింజలను కొనుగోలు చేస్తున్న జీసీసీ అధికారులు

సాక్షి,పాడేరు: జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో లభ్యమవుతున్న అటవీ ఫలసాయం, గిరిజనులు సాగు చేస్తున్న వ్యవసాయ ఉత్పత్తులు, వాణిజ్య పంటలను గిట్టుబాటు ధరలతో కొనుగోలుకు జీసీసీ శ్రీకారం చుట్టింది. గతంలో వలే ఈఏడాది కూడా మార్కెట్‌లో దూసుకుపోయేందుకు భారీ లక్ష్యాన్ని ఆ సంస్థ యాజమాన్యం నిర్దేశించింది. వాణిజ్య పంట కాఫీతో పాటు, రాజ్‌మా, రాగులు, పసుపు, గిరిజనులు సేకరించే పలు అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు కసరత్తు మొదలు పెట్టింది. జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, చింతపల్లి జీసీసీ డివిజన్ల పరిధిలోని అన్ని వారపు సంతలతో పాటు, ప్రధాన జంక్షన్లు, డీఆర్ డిపోల వద్ద వ్యవసాయ, అటవీ ఉత్పత్తులను జీసీసీ కొనుగోలు చేస్తోంది. అంతేకాకుండా జీసీసీ ఉత్పత్తుల స్టాళ్లను కూడా ఏర్పాటుచేసింది.

కాఫీ గింజలు కిలో రూ.270..

జీసీసీ కాఫీ రైతులకు అన్ని విధాలా ఆదుకుంటోంది. దళారుల నుంచి గిరిజన రైతులను కాపాడే లక్ష్యంగా నాణ్యమైన తూకంతో పాటు, కిలో రూ.270 మద్దతు ధరతో కాఫీ గింజలను కొనుగోలు చేపట్టింది. పాడేరు డివిజన్‌లో రూ.10.50 కోట్లు, చింతపల్లి డివిజన్‌లో రూ.15 కోట్లతో కొనుగోలు లక్ష్యంగా పెట్టుకుంది. కాఫీ రైతులకు ముందస్తుగానే రుణాలను కూడా జీసీసీ అందజేసింది. ప్రస్తుతం కాఫీ దిగుబడి సీజన్ కావడంతో జీసీసీ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ప్రైవేట్ వ్యాపారులకు దీటుగా గిట్టుబాటు ధర చెల్లిస్తూ కొనుగోలు చేస్తున్నారు. జీసీసీ సిబ్బంది నేరుగా గ్రామాలకే తరలివెళుతుండడంతో కాఫీ రైతుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. అలాగే రాగులు, రాజ్‌మా, పసుపు తదితర వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు కూడా చేపట్టింది.

అటవీ ఉత్పత్తుల కొనుగోలుతో మేలు

జీసీసీ జిల్లా వ్యాప్తంగా గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులను గిట్టుబాటు ధరతో ప్రతి ఏటా కొనుగోలు చేస్తోంది. చింతపండు, తేనె, అడవి జిగురు, సీకాకాయ, కొండచీపుళ్లు, ఉసిరిపప్పు, కరక్కాయలు, నల్లజీడి పిక్కలు, ముసిడిగింజలు, నరమామిడి చెక్క తదితర అటవీ ఫలసాయాన్ని కూడా ఈఏడాది భారీగానే కొనుగోలు చేసే లక్ష్యంతో జీసీసీ ఉంది.



కాఫీ గింజలు



రాజ్‌మా గింజలు

జీసీసీ లక్ష్యం..

డివిజన్	అటవీ ఉత్పత్తులు	వ్యవసాయ ఉత్పత్తులు	కాఫీ
పాడేరు	రూ.3.87కోట్లు	రూ.1.21కోట్లు	రూ.10.50కోట్లు
చింతపల్లి	రూ.3.60కోట్లు	రూ.1.10కోట్లు	రూ.15 కోట్లు

గిరి రైతులకు మేలు చేయడమే లక్ష్యం



దళారీ వ్యవస్థ నుంచి గిరిజన రైతులను రక్షించే విధంగా జీసీసీ పనిచేస్తోంది. వ్యవసాయ, అటవీ ఉత్పత్తులను ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా కొనుగోలు చేస్తున్నాం. కాఫీగింజలతో పాటు, రాగులు, రాజ్‌మా, ఇతర అటవీ ఉత్పత్తులను మార్కెట్ ధరలకు తగ్గట్టుగానే గిట్టుబాటు ధరలతో కొనుగోలు చేస్తున్నాం.

– కురుసా పార్వతమ్మ, డీఎం, జీసీసీ, పాడేరు

పటిష్టమైన ఓటరు జాబితాకు సహకారం



మాట్లాడుతున్న ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ అహ్మద్‌బాబు, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో, సబ్‌కలెక్టర్

జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ అహ్మద్‌బాబు

సాక్షి, పాడేరు: పటిష్టమైన ఓటర్ల జాబితా తయారీకి అందరూ సహకరించాలని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ అహ్మద్‌బాబు అన్నారు. జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకుడిగా బుధవారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనకు కలెక్టర్ సుమీత్‌కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలోని ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులను ఓటరురు జాబితాలో చేర్పి, అనర్హులను తొలగిస్తున్నామని ఆయన తెలిపారు. ఎన్నికల విధులను ప్రాథమిక విధులగానే గుర్తించి, అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం పని చేయాలని, లేకుంటే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోను ఎన్నికల జాబితాను ప్రదర్శించాలని సూచించారు. ఎన్నికల జాబితా తయారీకి సంబంధించి బూత్‌స్థాయి అధికారి, ఓటర్ నమోదు అధికారి, సహాయ ఓటర్ నమోదు అధికారి, కలెక్టర్ కీలకమని, ఐదో వ్యక్తివద్ద పోలింగ్ సంబంధించి మెటీరియల్ ఉండకూడదని సూచించారు. యువ ఓటర్ల నమోదులో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కళాశాల స్థాయిలో ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఓటర్ నమోదు తొలగింపులు, తిరస్కరణలు పనులన్నీ పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. ఓటర్ల నమోదు, తిరస్కరణల్లో ఎలాంటి సమస్యలు ఏర్పడినా 9441412121 నంబరుకు సంప్రదించాలని కోరారు. లేకుంటే తమకు మెయిల్ చేయవచ్చునని తెలిపారు. అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ఓటర్ కార్డుపై ఫొటోలు, ఎపిక్ కార్డులను శతశాతం పూర్తిచేశామన్నారు. జిల్లాలో 1008 పోలింగ్ బూతులు ఉన్నాయని, ముసాయిదా ప్రకారం జిల్లాలో 715,707 ఓటర్లు ఉన్నారని తెలిపారు. అర్హులైన విద్యార్థులతో పాటు మారుమూల ప్రాంతాల్లో కొత్త ఓటర్ల నమోదుకు చర్యలు చేపడతామన్నారు. మరో 50 వేల మంది ఓటర్ల నమోదు లక్ష్యంతో పనిచేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. పాడేరు, అరకు ఎమ్మెల్యేలు, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణలు మాట్లాడుతూ.. చనిపోయినా వ్యక్తులకు సంబంధించి పేర్లను ఓటరు జాబితాల్లోంచి తొలగించడం లేదన్నారు. మారుమూల గ్రామాల్లో గిరిజనులు పది కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లి ఓటు హక్కు వినియోగించుకుంటున్నారన్నారు. వారిని సమీప పోలింగ్ కేంద్రాల్లో విలీనం చేయాలని కోరారు. ముంచంగిపుట్టు మండలం బొంగపుట్టు పంచాయతీలో పోలింగ్ బూత్ దూరంగా ఉన్నందున గడచిన ఎన్నికల్లో పోలింగ్‌ను బహిస్కరించారని ఎమ్మెల్యేలు పరిశీలకులు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన జిల్లా ఎన్నికల జాబితా పరిశీలకుడు జిల్లా వ్యాప్తంగా అదనంగా పోలింగ్ బూత్‌లు ఏర్పాటుకు వెంటనే ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఆదేశించారు. ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, జేసీ శివశ్రీనివాస్‌రావు, పాడేరు, రంపచోడవరం సబ్‌కలెక్టర్లు అభిషేక్, శుభం బన్సాల్, ట్రైనీ కలెక్టర్ శ్రీవాత్సవ్, డీఆర్వో దయానిధి, టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, కాంగ్రెస్ అరకు పార్లమెంట్ అధ్యక్షురాలు శాంతకుమారి, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పాడేరు, అరకు ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ, రాజకీయ పార్టీల నేతలు

మావోయిస్టులకు వ్యతిరేకంగా శాంతి స్థూపం



చింతపల్లిలో వెలసిన శాంతి స్థూపం

చింతపల్లి: మావోయిస్టుల చర్యలను వ్యతిరేకిస్తూ బుధవారం చింతపల్లి వారపుసంతలో శాంతి స్థూపం వెలసింది. అమాయక గిరిజనులను హతమార్చడమే మావోయిజమా అంటూ నినాదాలు రాశారు. వారి చర్యల కారణంగా ఎంతో మంది గిరిజనుల కుటుంబాలు వీధిన పడ్డాయంటూ స్థూపంపై పేర్కొన్నారు. వారి చేతిలో హత్యకు గురైన పలువురి గిరిజనులకు నివాళులు అర్పించారు. మావోయిస్టుల పీఎల్‌జీఏ వారోత్సవాల సందర్భంగా శాంతి స్థూపాలు దర్శనమిస్తున్నాయి.

ప్రశాంతంగా ముగిసిన వారోత్సవాలు

మావోయిస్టు పీఎల్‌జీఏ వారోత్సవాలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల రెండు నుంచి ఏడవ తేదీ వరకు మావోయిస్టులు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏఎస్పీ ప్రతాప్ శివకిషోర్ ఆధ్వర్యంలో భద్రత ఏర్పాట్లు ముమ్మరం చేశారు. గాలింపు చర్యలు, వాహన తనిఖీలు విస్తృతంగా చేపట్టడంతో వారోత్సవాల సందర్భంగా ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ముగిశాయి. దీంతో ఈ ప్రాంత గిరిజనులు ఊపిరి పీల్చుకున్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు

- స్థానిక నివాసం తప్పనిసరి
- మైదాన ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తే చర్యలు
- వైద్యాధికారులకు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ సూచన

పాడేరు రూరల్: గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, అందుకు అనుగుణంగా వైద్యసేవలందించాలని ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ సూచించారు. బుధవారం ఆయన స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఐటీడీఏ పరిధిలోని 35 పీహెచ్‌సీల వైద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వైద్యాధికారులు స్థానికంగా నివాసం ఉండాలన్నారు. ఇకపై మైదాన ప్రాంతాల నుంచి ఆస్పత్రులకు రాకపోకలు చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. 24 గంటల వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇద్దరేసి వైద్యులను నియమించిందన్నారు. గర్భిణులను ప్రసవానికి 15రోజుల ముందే బర్త్ వెయిటింగ్ కేంద్రాలకు తరలించి వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. పీహెచ్‌సీల్లో హెచ్‌డీఎస్ నిధులను సక్రమంగా వినియోగించాలని ప్రతీ నెల మూడవ శుక్రవారం ఇందుకు సంబంధించి సమావేశం నిర్వహించాలని సూచించారు. వీటి తీర్మానాలను తమకు అందజేయాలని ఆదేశించారు. కోరుకొండ, పెదవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనులపై పీవో గోపాలకృష్ణ వివరాలు తెలుసుకున్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ జమాల్‌బాషా మాట్లాడుతూ ఆస్పత్రులకు వచ్చే రోగులతో వైద్య సిబ్బంది సానుకూల దృక్పథంతో ఉండి మెరుగైన వైద్యం అందించాలన్నారు. సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు పింఛన్ అందేలా వైద్యాధికారులు బాధ్యత వహించాలని సూచించారు. ఐసీడీఎస్, పీహెచ్‌సీ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలల్లో తరచూ వైద్య శిబిరాలు నిర్వహించి, విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ లీలాప్రసాద్, జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ టి. విశ్వేశ్వరనాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

చిలగడ దుంపలకు భలే గిరాకీ

- 50కిలోల బస్తా రూ.1100 నుంచి రూ.1300
- ఒడిశా, ఆంధ్రా వారపు సంతల్లో భారీగా విక్రయాలు





చిలగడ దుంపలను శుభ్రం చేస్తున్న గిరిజన రైతు

డుంబ్రిగుడ: గిరిజన రైతులు పండించిన చిలగడ దుంపలకు వారపు సంతల్లో మంచి గిరాకీ ఏర్పడుతోంది. మండలంలోని మారుమూల పంచాయతీ సొవ్వ పరిసర ప్రాంతాల్లో కూరగాయలతోపాటు చిలగడ దుంపలను పండిస్తున్నారు. వీటికి ఒడిశాలో మంచి డిమాండ్ ఉన్నందున వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తుంటారు. గురువారం వస్తే చాలు ప్రతి గ్రామంలో కూడా దుంపలను శుభ్రం చేస్తూ కనిపిస్తుంటారు. వీటిని ప్రతి శుక్రవారం జరిగే వారపు సంతలో విక్రయిస్తుంటారు. అంతేకాకుండా విశాఖలోని రైతు బజార్లకు తరలిస్తున్నారు. ప్రతి గురువారం సుమారు 10 టన్నుల మేర చిలగడ దుంపల వ్యాపారం జరుగుతోంది. 50 కిలోల బస్తా రూ.1100 నుంచి రూ1300 వరకు విక్రయిస్తున్నారు.ధర లాభదాయకంగా ఉందని రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

దిగుబడి బాగుంది



గత ఏడాది కంటే ఈ ఏడాది దిగుబడి బాగా వచ్చింది. దీంతో ప్రతి వారం కూడా ఒడిశా,ఆంధ్రా వ్యాపారులకు విక్రయిస్తున్నాం. వెంటనే నగదు చెల్లిస్తున్నారు.

–అర్జున్, గిరి రైతు, సొవ్వ

గిరి విద్యార్థినులను వేధించడం వాస్తవమే



విద్యార్థినులతో మాట్లాడుతున్న బాలు అక్కిస

రంపచోడవరం: మండలంలోని కాకవాడ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థినులను హెచ్‌ఎం భర్త వేధించడం వాస్తవమేనని మాజీ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబరు, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు అక్కిస బాలు తెలిపారు. బుధవారం పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థినులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విచారణలో గిరిజన విద్యార్థినులపై వేధింపులు జరిగినట్లు గుర్తించినట్లు తెలిపారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి సంఘటనలకు ఆస్కారం ఉంటుందని ఆయన తెలిపారు. నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల బాక్సు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. దాని తాళం ఉన్నతాధికారుల వద్ద ఉంటుందని వారానికి ఒకసారి పర్యవేక్షణ చేయాల్సి ఉందన్నారు. కాని అలా జరగడం లేదన్నారు. హెచ్‌ఎం, అలాగే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

శిక్షణ ఎంపిక ప్రవేశ పరీక్షకు విశేష స్పందన

చింతపల్లి: పోలీసు ఉద్యోగాలకు సంబంధించి గిరి యువతకు జిల్లా పోలీసు శాఖ కల్పిస్తున్న ఉచిత శిక్షణ ఎంపికకు నిర్వహించిన పరీక్షకు విశేష స్పందన లభించింది. చింతపల్లి కేంద్రంలో 154 మంది హాజరయ్యారు. ఏఎస్పీ ప్రతాప్ శివకిషోర్ పర్యవేక్షణలో ఎంపిక పరీక్ష నిర్వహించారు. ముందుగా అభ్యర్థుల ఎత్తు, బరువు, ఛాతి కొలతలను తీసుకుని అర్హులైన వారికి పరీక్షలు రాసే అవకాశం కల్పించారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచితంగా వసతి, భోజన సౌకర్యం కల్పించి శిక్షణ ఇవ్వనున్నట్లు ఏఎస్పీ తెలిపారు. పరీక్షలకు 37 మంది యువతులు,117 మంది యువకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐ రమేష్, ఎస్‌ఐ మహ్మద్ షరీఫ్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మారేడుమిల్లి: గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలోని 2022- 2023 నిమిత్తం ఖాళీగా ఉన్న టీజీటీ, పీజీటీ, జేఎల్ పోస్టులకు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల పాఠశాల, కళాశాల కన్వీనర్, స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆహ్మద్ ఆలీషా తెలిపారు. కళాశాల, పాఠశాలలోని తెలుగు 8, ఇంగ్లీషు 7, లెక్కలు 5, సైన్స్ 5, ఫిజిక్స్ బొటనీ, కెమిస్ట్రి, సోషల్ 10, హిహిస్టరీ, కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ లైబ్రేరియన్ 2, పీడీ, పీఈటీ 3, ఆర్ట్ క్రాఫ్ట్ 2 చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థులు పీజీ, బీఈడీ, టెట్ ఉత్తీర్ణత సాధించిన వారు మాత్రమే అర్హులన్నారు. ఈనెల 12 తేదీ లోపు దరఖాస్తులను రంపచోడవరం లేదా మారేడుమిల్లి గురుకుల పాఠశాల, కళాశాలలో సమర్పించాలని కోరారు. అభ్యర్థులు అన్ని పోస్టులకు పోస్టుగాడ్యుయేషన్ పూర్తి చేయడమే కాకుండా ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం తప్పనిసరి అన్నారు.







తొలిమంచు వేళ..

మన్యం వైవిధ్య అందాలకు నిలయం.. శీతాకాలంలో మంచు కురిసే వేళ ఈ దృశ్యాలు మరింత అద్భుతం.. తూర్పు తెలవారుతున్నా.. మంచు తెరలువీడకున్నా.. చలి వణికిస్తున్నా జీవన పోరాటంలో ముందుకు సాగాల్సిందే. - రాజవొమ్మంగి/ముంచంగిపుట్టు

గిరి గ్రామాలపై చలిపంజా

ముంచంగిపుట్టు: మండలంలో రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. గిరిజన గ్రామాలపై చలి పంజా విసురుతోంది. మంచు దట్టంగా కురుస్తుండడంతో రోజువారీ పనులకు వెళ్లే కూలీలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు గజగజ వణుకుతున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి చలి మొదలు ఉదయం 10 గంటల వరకు చలితీవ్రత అధికంగా ఉంటోంది. చలి నుంచి ఉపశమనం పొందేందుకు గ్రామాల్లో చలి మంటలు వేసుకుంటున్నారు. బుధవారం ఉదయం 9 గంటల వరకు మంచు తెరలు గ్రామాలను కమ్మేస్తున్నాయి. వాహనాదరులు హెడ్‌లైట్ వెలుగులో రాకపోకలు సాగిస్తున్నారు. సూర్యోదయం ఆలస్యమవుతోంది. గిరి రైతులు మంచులోనే వ్యవసాయ పనులు చేపడుతున్నారు.

చింతపల్లిలో పెరిగిన చలి

చింతపల్లి రూరల్: చింతపల్లిలో చలి తీవ్రత మళ్లీ పెరిగింది. బుధవారం 11 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్లు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ సురేష్ కుమార్ తెలిపారు. రెండు రోజులుగా చలి పెరుగుతుండడంతో ఈ ప్రాంతీయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం 12 డిగ్రీలుగా నమోదైన ఉష్ణోగ్రతలు బుధవారానికి 11 డిగ్రీలకు పడిపోయింది. రానున్న రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన యువకుడిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

పాడేరు రూరల్: మండలంలోని గుత్తులపుట్టు వద్ద మంగళవారం సాయంత్రం ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పెదబయలు మండలం సీతగుంట గ్రామానికి చెందిన గంపరాయి ప్రసాద్‌తో పాటు మరో వ్యక్తి ద్విచక్ర వాహనంలో పాడేరు నుంచి పెదబయలు వెళ్తుండగా మంగళవారం సాయంత్రం ఈప్రమాదం చోటుచేసుకుంది. గుత్తులపుట్టు వద్ద బైక్ అదుపు తప్పి ప్రమాదానికి గురి కావడంతో ప్రసాద్ కుడి కాలు భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన అతడిని 108 వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు.

నేటి నుంచి రోటరీ అంతర్జాతీయ సమ్మేళనం

ఏయూక్యాంపస్(విశాఖ తూర్పు): రోటరీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా జోనల్ సమ్మేళనం గురువారం నుంచి ఈ నెల 11 వరకు నగరంలో నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ డాక్టర్ కె.మహేష్ వెల్లడించారు. ఏయూ సెనేట్ హాలులో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి రోటరీ అంతర్జాతీయ అధ్యక్షురాలు జెన్నిఫర్ జోన్స్ హాజరవుతున్నట్లు చెప్పారు. 4 వేల మందికి వీల్‌చైర్‌లు, కుట్టుమిషన్లు, సైకిళ్లు, పొగగాని పొయ్యిలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. యువతను ఆరోగ్యంగా ఉంచడానికి, ఆరోగ్య జీవనం అలవాటు చేయడానికి 10 కె రన్ ఏర్పాటు చేశామన్నారు. రోటరీ ఇన్స్టిట్యూట్ చైర్మన్ సి.హెచ్ కిశోర్ కుమార్ మాట్లాడుతూ విశాఖ వేదికగా నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ సమ్మేళనానికి 20 దేశాల నుంచి 1000 మందికి పైగా ప్రతినిధులు హాజరవుతారన్నారు. మిజోరాం గవర్నర్ డాక్టర్ కె.హరిబాబు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ, క్రికెటర్ సునీల్ గవాస్కర్ ప్రత్యేక ప్రసంగాలు ఉంటాయన్నారు.

గిరిజన సంప్రదాయ ప్రతీక.. పలకం వేడుక

- అమ్మవారికి ప్రత్యేక పూజలు
- ఆచార, సంప్రదాయాలతో పండగ

అనంతగిరి: గిరిజన జీనవం, సంప్రదాయాలు, ఆచార, వ్యవహారాలు విభిన్నం...వేడుకలు కూడా ప్రత్యేకంగా జరుపుకుంటారు. రోజురోజుకు సంప్రదాయాలు, ఆచారాలు కనుమరుగవుతున్న ప్రస్తుత రోజుల్లో కూడా గిరిజనులు తమ సంప్రదాయాలను భావి తరాలకు అందిస్తూ..మార్గదర్శకంగా నిలుస్తున్నారు. ప్రకృతే జీవనాధారంగా భావించి గిరిజనులు జరుపుకుంటున్న వేడుకలు అనేకం.. ఇందులో భాగంగా ప్రస్తుతం మన్యంలోని కొన్ని ప్రాంతాల్లో పలకం పండగ జరుపుకుంటున్నారు. ఏటా డిసెంబర్ మాసంలో ఈ పండగ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు చేస్తారు.

- పినకోట పంచాయతీ గిరి శిఖర గ్రామంలో పందిరిమామిడి గ్రామంలో పలకం పండగను బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామాంలో 11 కుటుంబాలకు చెందిన గిరిజనులు జీవిస్తున్నారు.



కోడికి బియ్యం గింజలను తినిపిస్తున్న గ్రామస్తులు

పండగ ప్రత్యేకత

అడవిలో దొరికే అడ్డపిక్కలు, గ్రామంలో పండించుకునే చిక్కెడు పిక్కలను గిరిజనులు తీసుకునేందుకు తప్పనిసరిగా ఈ పలకం పండగ ఆచరిస్తారు.

పూర్వీకుల ఆచారాన్ని గ్రామస్తులు అనుసరించి పండగ జరుపుకుంటారు. పండగ రోజు తెల్లవారుజామున ఇంటిల్లి పాది స్నానాలాచరించి, కొత్త దుస్తులు ధరిస్తారు. గ్రామం నుంచి అమ్మవారి ఆలయానికి సంప్రదాయ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా వెళ్తారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఊరేగింపునకు ముందుగా ఒక కోడిని గ్రామ పెద్దలు ఇంటింటికీ తీసుకెళ్లి బియ్యం గింజలను తినిపిస్తారు. అనంతరం అమ్మవారి గుడి వద్దకు చేరుకుంటారు. అమ్మవారి వద్ద చేతికందిన పంటను, ధినుసులను సమర్పిస్తారు. గ్రామానికి నష్టం జరగకూడదని, అందరూ ఆరోగ్య, అష్టైశ్వర్యాలతో ఉండాలని కాంక్షిస్తూ పూజలు చేస్తారు. ఏటా కోడిని..ఐదేళ్లకొకసారి మేకను సమర్పించడం ఆనవాయితీ. కార్యక్రమం పూర్తయిన తరువాత అడవి నుంచి సేకరించిన అడ్డకాయలను, చిక్కెడు పిక్కలను కలిపిన ప్రసాదాన్ని స్వీకరిస్తారు. అనంతరం అమ్మవారి గుడి ప్రాంగణంలో వంట చేసి, సహపంక్తి భోజనం చేస్తారు. రోజురోజుకు కనుమరుగవుతున్న గిరిజన ఆచారాలను కాపాడుకుంటూ ఈ రోజుల్లో కూడా తమ పూర్వీకుల సంప్రదాయన్ని మరిచిపోకుండా పలకం పండగను భక్తిశ్రద్ధలతో జరుకుంటున్నామని గ్రామపెద్దలు భీమన్న, ఈశ్వరరావు చెబుతున్నారు. పలకం వేడుక..గిరిజన సంప్రదాయ ప్రతీకగా నిలుస్తోంది.



అమ్మవారి గుడివద్ద పూజలు చేస్తున్న గిరిజనులు

వ్యవసాయ మీటర్లతో బెల్లం క్రషర్ల నిర్వహణ

నాలుగు క్రషర్స్‌పై కేసుల నమోదు



దాడులు చేసిన అధికారులు



కశిరెడ్డి పాలెంలో వ్యవసాయ విద్యుత్ మీటర్లతో నిర్వహిస్తున్న బెల్లం తయారీ క్రషర్

రోలుగుంట: మండలంలో నిబంధనలు అతిక్రమించి వ్యవసాయ సాగు కోసం ప్రభుత్వం రైతులకు రాయితీపై ఇచ్చిన విద్యుత్ మీటర్లతో నిర్వహిస్తున్న బెల్లం తయారీ క్రషర్లపై బుధవారం విద్యుత్ శాఖ డిఈ సత్యానందం, గోవాడ సుగర్స్ ఫ్యాక్టరీ అధికారి రోలుగుంట సుగర్ కేన్ ఇన్‌స్పెక్టర్ వారి శాఖల సిబ్బందితో దాడులు చేశారు. కశిరెడ్డిపాలెం, జె.నాయుడుపాలెం గ్రామాల్లో స్థానిక రైతుల సహకారంతో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ఈ క్రషర్స్ నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. నిర్వాహకుల వద్ద క్రషర్స్ నిర్వహణకు సంబంధించి ఏ విధమైన ఆధార ధ్రువపత్రాలు లేకుండా ప్రభుత్వం స్థానిక రైతులకు వ్యవసాయం సాగు కోసం ఇచ్చిన విద్యుత్ మీటర్లతో ఈ క్రషర్స్ నిర్వహించడంపై నిర్వాహకులు, రైతులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసులు నమోదు చేశారు. మరలా ఈ విధమైన తప్పిదాలు చేస్తే మీటర్లు కనెక్షన్‌ను తొలగిస్తామని రైతులను డిఈ హెచ్చరించారు. అలాగే పొరుగు జిల్లాల నుంచి వచ్చి బెల్లం క్రషర్స్ నిర్వహణతో తమ ఫ్యాక్టరీకి చెరకు సరఫరాకు అంతరాయం కల్పించిన నేరంపై నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్టు రోలుగుంట సుగర్స్ కేన్ ఇన్‌స్పెక్టర్ తమరాన కొండబాబు విలేకరులకు వివరించారు. అనుమతులు లేని బెల్లం క్రషర్స్‌పై తమ దాడులు కొనసాగుతాయన్నారు. స్థానిక రైతులు కూడా వీటిని ప్రోత్సహించడం నేరమన్నారు. ఇటువంటి అక్రమ క్రషర్స్ నిర్వహణ జరిగితే తమకు సమాచారం ఇచ్చి వాటిని నియంత్రించేందుకు రైతులు, నాయకులు సహకరించి, ఫ్యాక్టరీకి చెరకు సరఫరాకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దాడుల్లో విద్యుత్ శాఖ ఏఈ పద్మనాభం, ఏరియా ఫీల్డ్‌మెన్లు జోగినాయుడు, నూకరాజు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు

కొయ్యూరు: పంచాయతీలలో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) టి.కొండలరావు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. ఎక్కడైకనా అపరిశుభ్రంగా కనిపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజేంద్రపాలెం, మర్రివాడ, బూదరాళ్ల, చీడిపాలెం పంచాయతీల్లో ఆయన బుధవారం పర్యటించారు.రాజేంద్రపాలెంలో అల్లూరి పార్క్ ఎదుట చెత్త వేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులను కోరారు. డంపింగ్ యార్డులను కూడా శుభ్రంగా ఉంచాలని సూచించారు. తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. అదే విధంగా బ్లీచింగ్ వేయించాలని సూచించారు. వీధి దీపాల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట కార్యదర్శులు రాము, శ్రీనివాస్ ఉన్నారు.



రాజేంద్రపాలెంలో పారిశుద్ధ్యం పనితీరును పరిశీలిస్తున్న డీపీవో కొండలరావు

విజృంభిస్తున్న చలిగాలులు

- మన్యంలో నమోదవుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- మినుములూరులో 10..
- చింతపల్లిలో 11..
- అరకులోయలో 11 డిగ్రీల నమోదు



సాక్షి, పాడేరు: జిల్లాలో చలితీవ్రత నెలకొంది. ఏజెన్సీలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి.పాడేరు మండలం మినుములూరులో 10,చింతపల్లిలో 11,అరకులోయలో 11 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు బుధవారం నమోదయ్యాయి. పొగమంచు దట్టంగా కురిసింది.ఉదయం 10గంటల వరకు మంచుతెరలు వీడలేదు. సాయంత్రం నుంచి చలిగాలులు విజృంభించడంతో పర్యాటకులతో పాటు స్థానికులు చలిమంటలను ఆశ్రయించారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కుంజం మురళీ

దేవీపట్నం: ఇందుకూరుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ కుంజం మురళీ, జెడ్పీటీసీ సభ్యురాలు శిరశం సత్యవేణితో కలిసి బుధవారం ప్రారంభించారు. ఎంపీపీ మురళీ మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి, మద్దతు ధర పొందాలన్నారు. రంపచోడవరం ఏడీఏ విశ్వనాథ చౌదరి మాట్లాడుతూ దేవీపట్నం మండలంలో నాలుగు రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. పౌరసరఫరాల శాఖ డిఎం గణేష్ మాట్లాడుతూ రైతు పండించిన ధాన్యం తరలింపునకు రవాణా చార్జీలు, గోనెసంచులు, హమాలీ చార్జీలు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ధాన్యం విక్రయంలో ఇబ్బందులు, సమస్యలుంటే టోల్‌ఫ్రీ 1902 లేదా, 155251 నంబర్‌కు ఫోన్‌ద్వారా తెలియజేయాలని అన్నారు. ఎంఎఓ జెన్నీ మాట్లాడుతూ ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద విఎఎ, టెక్నికల్ అసిస్టెంట్, ఇద్దరు వలంటీర్లు ఉంటారని, టెక్నికల్ అసిస్టెంట్ కళ్లాల వద్ద కు వెళ్లి ధాన్యం శాంపిల్స్ సేకరించి నాణ్యత నిర్ధారించిన తర్వాత మిల్లుకు కేటాయిస్తారని తెలిపారు. వైఎస్ ఎంపీపీ గారపాటి మురళీకృష్ణ, ఎంపీడీఓ రత్నకుమారి, సర్పంచ్ కృష్ణబాబు, పీఎసిఎస్ సీఈవో కె.పాపారావు, రైతులు రవి ,నాగు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగాలకు ఉచిత కోచింగ్

ముంచంగిపుట్టు: పోలీసు కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ఆదివాసీ విద్య ఫౌండేషన్ ప్రతినిధులు జి.కృష్ణమూర్తి, ఎం.రామకృష్ణ, బి.బాబురావు, వి.రవికుమార్‌లు తెలిపారు. వారు బుధవారం మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో పోలీసు శాఖలో ఖాళీల భర్తీ కోసం సన్నద్ధమవుతున్న గిరిజన అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈనెల 8వ తేదీ నుంచి కోచింగ్ కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐదు రోజుల్లో కోచింగ్ ప్రారంభమవుతుందని, మరి న్ని వివరాలకు 6303383519, 6302560937, 9492832535 నంబర్లకు సంప్రదించాలని వారు కోరారు.

యువతి హత్య కేసులో ఇద్దరికి 20 ఏళ్లు జైలు

విశాఖ లీగల్: స్వల్ప పరిచయంతో ఒక యువతిపై లైంగిక దాడి చేసి అతిదారుణంగా హత్య చేసి సాక్ష్యాలను మాయం చేసిన ఇద్దరు వ్యక్తులకు 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.25వేలు జరిమానా విధిస్తూ విశాఖలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి రామశ్రీనివాసరావు మంగళవారం తీర్పునిచ్చారు. హత్య చేసిన నేరానికి సెక్షన్ 302 కింద 20 ఏళ్ల జైలు, రూ.10వేలు జరిమానా, పోక్సో చట్టం సెక్షన్ 4 కింద 20 ఏళ్ల జైలు, రూ.10వేలు జరిమానా, సాక్ష్యాలను మాయం చేసినందుకు ఏడేళ్ల జైలు, రూ.5వేలు జరిమానా న్యాయమూర్తి విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 18 నెలలు సాధారణ జైలుశిక్షను విధిస్తూ న్యాయమూర్తి ఆ తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలిలా ఉన్నాయి. నిందితుల్లో కోన మహేష్(28) లింగాపురం గ్రామం కోటవురట్ల మండలానికి చెందిన వాడు. రెండో నిందితుడు వంగల నానాజీ(24) కూడా అదే గ్రామానికి చెందిన వాడు. మహేష్ తన ఇంటి దగ్గరలో జీడితోటలకు కాపలాదారునిగా ఉండేవాడు. నానాజీ వృత్తిరీత్యా వడంగ్రి. వీరిద్దరికీ అప్పన పాలెం వాసి అయిన ఇంటర్ విద్యార్థిని (17)తో పరిచయం ఉంది. ఆమె తండ్రి సరడ తాతారావు ఆటోడ్రైవర్, తల్లి మంజుల నర్సీపట్నంలో ఒక వస్త్ర దుకాణంలో పని చేసేది. నిందితులిద్దరూ 2015 ఏప్రిల్ 8వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో మహేష్ తాను కాపలా ఉండే జీడితోటలోకి ఆ యువతిని తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. కొంతసమయం తరువాత నానాజీ కూడా అక్కడికి చేరుకొని ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఇద్దరూ ప్రణాళిక ప్రకారం యువతి వేసుకున్న చున్నీని ఆమె మెడకు బిగించి హత్య చేశారు. మృతి చెందిన యువతిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. కాగా తన కుమార్తె ఇంట్లో లేకపోవడంతో యువతి తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికారు. స్థానికుల సమాచారంతో సమీపంలోని జీడితోటలో మృతదేహాన్ని గుర్తించి ఆనవాళ్లు బట్టి తమ కుమార్తెగా గుర్తించారు. ఘటనపై తండ్రి తాతారావు స్థానిక వీఆర్వో సోమయాజులకు తెలియజేయడంతో వీఆర్వో గొలుగొండ పోలీసులు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో నిందితులు 23 రోజుల తర్వాత పోలీసులకు లొంగిపోయారు. గొలుగొండ ఇన్‌స్పెక్టర్ నగేష్ కేసు దర్యాప్తు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. న్యాయమూర్తి 16 మంది సాక్షులను విచారించారు. సంచలనం సృష్టించిన ఈ కేసులో న్యాయమూర్తి నిందితులు నేరం చేసినట్టు నిర్ధారించారు. యువతిపై లైంగిక దాడికి పాల్పడినందుకు పోక్సో(బాలల లైంగికదాడి నివారణ ప్రత్యేక చట్టం) సెక్షన్ 4 కింద 20 ఏళ్ల జైలు, హత్య చేసిన నేరానికి ఐపీసీ 302 సెక్షన్ కింద మరో 20 ఏళ్లు జైలు, సాక్ష్యాలను మాయం చేసినందుకు ఐపీసీ 201 సెక్షన్ కింద ఏడేళ్ల జైలు విధించారు. ఏకకాలంలో శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తన తీర్పులో స్పష్టం చేశారు.

180 కిలోల గంజాయి పట్టివేత

నక్కపల్లి: జాతీయ రహదారిపై వేంపాడు టోల్‌గేట్ వద్ద బుధవారం 180 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. అనకాపల్లి నుంచి తుని వెళ్లే ఐషర్ వ్యాన్‌లో 180 కిలోల గంజాయిని నాలుగు మూటల్లో ఉంచి తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు టోల్‌గేట్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అహ్మదాబాద్ వసంత్ విహార్‌ఏరియాకు చెందిన డ్రైవర్ ధర్మపురి సింగ్ ఈ గంజాయిని తరలిస్తున్నట్టు గుర్తించారు. ఇతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ శిరీష తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలువ సుమారు రూ. 3లక్షలు ఉంటుందన్నారు.

పాలవ్యాన్ ఢీకొని సరుగుడు వ్యాపారి మృతి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ఇరువాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సరుగుడు వ్యాపారి మృతి చెందిన సంఘటనతో ఆయన స్వగ్రామమైన రావిపాలెంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రావిపాలేనికి చెందిన బి.తాతారావు(53) మంగళవారం రాత్రి తన భార్యను ఇంటికి తీసుకొచ్చేందుకు ఇరువాడ జంక్షన్‌కు వెళ్లి బైక్‌ను పార్క్ చేసి వేస్తుండగా, నాగవరం నుంచి ఇరువాడ వైపు వెళ్తున్న పాల వ్యాన్ ఢీకొట్టింది. దీంతో తాతారావు అక్కడికక్కడే మృతి చెందాడు. గాజువాక నుంచి బస్సులో వస్తూ ఇరువాడ జంక్షన్‌లో దిగిన తాతారావు భార్య విగత జీవిగా పడి ఉన్న భర్తను చూసి కన్నీరుమున్నీరు అయ్యింది. తాతారావుకు భార్య, కుమారుడు ఉన్నారు.

పట్టుదలతో విజయం తథ్యం



జి.మాడుగులలో రాత పరీక్షను పర్యవేక్షిస్తున్న సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ శ్రీనివాస్



కొయ్యూరులో అభ్యర్థులకు సూచనలిస్తున్న సీఐ స్వామినాయుడు



అడ్డతీగలలో గిరిజన అభ్యర్థి ఎత్తు కొలుస్తున్న సీఐ వై.రాంబాబు



కూనవరంలో సీఐ గజేంద్రకుమార్ పర్యవేక్షణలో అభ్యర్థులకు కొలతలు తీస్తున్న సిబ్బంది



రాజవొమ్మంగిలో అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న పోలీసు అధికారులు



అరకులోయలో పరీక్ష రాస్తున్న అభ్యర్థులు



వై.రామవరంలో పరీక్షకు హాజరైన అభ్యర్థులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ సంతోష్ కుమార్

అరకులోయ రూరల్: పోలీసు ఉద్యోగాలకు సంబంధించి గిరిజన యువతకు జిల్లా పోలీసు శాఖ కల్పిస్తున్న ఉచిత శిక్షణ ఎంపికకు బుధవారం నిర్వహించిన పరీక్షకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ప్రతి మండలంలో సీఐ, ఎస్‌ఐల ఆధ్వర్యంలో నిర్వహించిన స్క్రీనింగ్ టెస్ట్‌కు వచ్చిన గిరిజన అభ్యర్థుల ఎత్తు, శరీధ ధారుఢ్యాన్ని పరీక్షించారు. రాత పరీక్ష నిర్వహించారు. పరీక్షకు హాజరైన వారికి భోజన సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్‌ఐలు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పలువురు సీఐలు, ఎస్‌ఐలు మాట్లాడుతూ పట్టుదలతో సరైన ప్రణాళికతో చదివితే విజయం తథ్యమన్నారు. స్క్రీనింగ్ టెస్ట్‌కు గిరిజన యువత నుంచి అనూహ్య స్పందన వచ్చింది. రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి ఐటీడీఏ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసు కానిస్టేబుల్, ఇన్‌స్పెక్టర్ తదితర పోస్టులకు స్ఫూర్తి కార్యక్రమం ద్వారా ఉచిత భోజన, వసతితో శిక్షణ అందజేయనున్నారు. కార్యక్రమంలో భాగంగా అరకులోయలో జరిగిన కార్యక్రమంలో రాత పరీక్షకు 155 మంది హాజరైనట్టు ఎస్‌ఐ సంతోష్ చెప్పారు.

అనంతగిరి: స్థానిక జూనియర్ కాలేజీలో జరిగిన స్క్రీనింగ్ టెస్ట్‌కు 100 మంది హాజరైనట్టు ఎస్‌ఐ కరక రాము తెలిపారు.

దుంబ్రిగుడ: మండల కేంద్రంలో ఎస్‌ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షను మహిళా పోలీసుల ఈశ్వరి, సీతమ్మ, సిబ్బంది రాజుబాబు తదితరులు పర్యవేక్షించారు.

పెదబయలు: స్థానిక గురుకుల రెసిడెన్షియల్ కాలేజీలో నిర్వహించిన రాత పరీక్షకు 110 మంది అభ్యర్థులు హాజరైనట్టు ఎస్‌ఐ పి.మనోజ్‌కుమార్ చెప్పారు.

జి.మాడుగుల: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలో నిర్వహించిన స్క్రీనింగ్ టెస్ట్‌కు 70 మంది గిరిజన అభ్యర్థులు హాజరైనట్టు సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ శ్రీనివాస్ చెప్పారు.

కొయ్యూరు: కాకరపాడు గురుకుల జూనియర్ ప్రాంగణంలో నిర్వహించిన పరీక్షకు 90 మందికి హాజరైనట్టు సీఐ స్వామినాయుడు తెలిపారు. కొయ్యూరు ఎస్‌ఐ రాజారావు, మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

అడ్డతీగల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్క్రీనింగ్ టెస్ట్‌కు 117 మంది గిరిజన అభ్యర్థులు హాజరైనట్టు సీఐ వై.రాంబాబు చెప్పారు. ఎస్‌ఐ అప్పలరాజు, సిబ్బంది పరీక్షను పర్యవేక్షించారు.

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో జరిగిన పరీక్షలకు 77 మంది గిరిజన అభ్యర్థులు హాజరైనట్టు సీఐ రవికుమార్ చెప్పారు. రాజవొమ్మంగి ఎస్‌ఐ గోపీనరేంద్ర ప్రసాద్, జడ్డంగి ఎస్‌ఐ షరీఫ్ పర్యవేక్షించారు.

కూనవరం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షకు 183 మంది హాజరైనట్టు ఎటపాక సీఐ గజేంద్రకుమార్ చెప్పారు. ఇన్‌చార్జి ఎస్‌ఐ తెల్లం దుర్గారావు, హెచ్‌సీలు శ్రీనివాసరావు, రామకృష్ణ, సిబ్బంది పరీక్షను పర్యవేక్షించారు.

వై.రామవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించిన పరీక్షకు 40 మంది అభ్యర్థులు హాజరైనట్టు ఎస్‌ఐ ఎం.సంతోష్‌కుమార్ చెప్పారు. ప్రిన్సిపాల్ ఈశ్వరకృప, పోలీసు సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులున్నారు..